నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | NIZAMABAD

అనాథ బాలికలకు అండగా నిలుద్దాం

బాలికల విద్యాభివృద్ధి కోసం 'భవిష్య జ్యోతి ట్రస్ట్' ఏర్పాటు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ట్రస్ట్‌కు సంబంధించి ఖాతా వివరాలను ప్రదర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కంఠేశ్వర్, అక్టోబర్ 19: అనాథ బాలికల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తూ, వారికి అండగా నిలుద్దామని జిల్లా ప్రధాన న్యా యమూర్తి కుంచాల సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అనాథ బాలికల విద్యాభివృద్ధి కోసం 'భవిష్య జ్యోతి ట్రస్ట్' ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు భవనాల సముదాయంలోని సమావేశపు హాలులో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగనేవార్, రెండో అదనపు న్యాయమూర్తి శ్రీనివాసులతో కలిసి హాజరయ్యారు. ట్రస్ట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా ఐసీఐసీఐ బ్యాంకులో అకౌంట్‌ను తెరిచామని తెలిపారు. దాతలు తమ విరాళాలను భవిష్య జ్యోతి అకౌంట్ నెం. 35470500 1646 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఐసీఐసీ 003547) లో జమచేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిని ప్రియదర్శన్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి శ్రీకాంత్‌బాబు, అనాథ బాలికలు, బాలభవన్ ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అనాథ బాలికల విద్యాభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్న కాకతీయ , రవి, నిర్మలహృదయ పాఠశాల యాజమాన్యాలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.

నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా సింధూశర్మ

వినాయక్‌నగర్, అక్టోబర్ 19: నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా కామారెడ్డి ఎస్పీ సింధూశర్మను నియమితులయ్యారు. ఇప్పటి వరకు నిజామాబాద్ సీపీగా పనిచేసిన కల్మేశ్వర్ సింగనవార్‌ను ప్రభుత్వం ఎన్‌పీఏ(నేషనల్ పోలీస్ అకాడమీ)కు డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో నిజామాబాద్ కమిషనరేట్‌కు కొత్త బాస్‌ను నియమించే వరకు కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇన్‌చార్జి సీపీగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు.

'ఆమె'కు భద్రతేది?

- ఇందూరులో గ్యాంగ్‌రేప్ కలకలం
- ఒంటరిగా ఉన్న మహిళను నమ్మించి ఆటోలో తీసుకెళ్లి అఘాయిత్యం
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

వినాయక్‌నగర్, అక్టోబర్19: జిల్లాలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయింది. అతివలపై ఆగడాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. తాజాగా మరో మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు దుండగులు. అర్ధరాత్రి వేళ నమ్మి వచ్చిన బాధితురాలిని దారి మళ్లించి దారుణానికి తెగబడ్డారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఉదంతం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. బోధన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ షాపింగ్ కోసమని శుక్రవారం నిజామాబాద్‌కు వచ్చింది. షాపింగ్ ముగించుకుని బస్టాండ్ చేరే సరికి రాత్రి 11 గంటలు అయింది. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో అక్కడే ఉన్న ఓ ఆటో వద్దకు వెళ్లి తాను బోధన్ వైపు వెళ్లాలని చెప్పగా, డ్రైవర్ అటే వెళ్తున్నామని చెప్పాడు. అప్పటికే ఆటోలో మగవాళ్లు ఉండడంతో వారు కూడా ప్రయాణికులే అనుకుని ఆ మహిళ ఆటోవాలాను నమ్మింది. ఆమె ఆటో ఎక్కగానే సదరు ఆటోడ్రైవర్ బోధన్ వైపు కాకుండా డిచ్‌పల్లి వైపు ఆటోను మళ్లించాడు. ఇది గమనించిన మహిళ ఆటోడ్రైవర్‌ను ప్రశ్నించగా, పక్కన కూర్చున్న వారు అరిస్తే చంపుతామంటూ భయపెట్టారు. అనంతరం డిచ్‌పల్లి-రాంపూర్ మార్గమధ్యంలో ఓ నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి నలుగురు కలిసి ఒకరి తర్వాత ఒకరు ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. విషయం ఎవరికైనా చెబితే నీ అంతు చూస్తామంటూ ఆమెను నిజామాబాద్ బస్టాండ్ వద్ద దింపేసి వెళ్లిపోయారు. ఎలాగోలా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్న బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్న ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మరోవైపు, పోలీసులు కేసును కొలిక్కి తెచ్చినట్లు తెలిసింది. డిచ్‌పల్లి శివారు ప్రాంతాలకు చెందిన నలుగురు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



నందిపేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎగవేతల సర్కారుపై రైతన్నల ఆగ్రహం

ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

ఎన్నికల ముందు కాంగ్రెస్ వరాల జల్లు
గద్దెనెక్కాక అన్ని హామీలకు చిల్లు
రైతుభరోసా ఇప్పట్లో లేదన్న వ్యవసాయ మంత్రి
తుమ్మల వ్యాఖ్యలపై వెల్లువెత్తిన ఆగ్రహం
మండలాల్లో దిష్టిబొమ్మల దహనం
నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

ఎన్నికలకు ముందు *వరాలు కురిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కాక హామీల ఎగవేతలకు తెర లేపింది. సగం మందికే రుణమాఫీ చేసి, మిగతా వారికి 'చేయి'చ్చిన రేవంత్ సర్కారు.. ఇప్పుడు రైతుభరోసాను ఎగ్గొట్టింది. వానకాలానికి సంబంధించిన పెట్టుబడి సాయం ఇవ్వట్లేదని శనివారం విస్పష్టంగా చెప్పింది. ప్రభుత్వ ప్రకటనపై కన్నెర్ర చేసిన ఉమ్మడి జిల్లా కర్షకులు.. సర్కారు దిష్టిబొమ్మలను దహనం చేశారు. నమ్మి ఓటేస్తే నట్టేటా ముంచిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని రైతులు స్పష్టం చేస్తున్నారు.*

-నిజామాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రైతులను, ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోసం అనేక హామీలు గుప్పించిన హస్తం పార్టీ.. గద్దెనెక్కాక వాటికి మంగళం పాడింది. రైతులందరికీ రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి, సగం మందికి కూడా చేయకుండా చేతులెత్తేసింది. ఇక, రైతుబంధు కింద కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేల సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ దాన్ని కూడా ఎగ్గొట్టేసింది. వానకాలానికి సంబంధించి రైతుభరోసా లేనట్లేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం ప్రకటించారు. కెబినేట్ సబ్ కమిటీ నివేదిక వస్తే యాసంగికి సంబంధించి రైతుభరోసా సంగతి చూస్తామని చెప్పారు. మంత్రి మాటలను బట్టి పెట్టుబడి సాయం పథకాన్ని శాశ్వతంగా ఎత్తేసే ప్రయత్నం కొనసాగుతున్నదని రైతాంగంలో చర్చ మొదలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యాసంగికి సంబంధించి పెట్టుబడి సాయాన్ని మొక్కుబడిగా కానిచ్చేశారు. ఆ తర్వాత వానకాలానికి సంబంధించి రైతుభరోసా డబ్బులను ఇవ్వలేదు. ఇదిగో, అదిగో అంటూ సీజన్‌ను ముగించేసిన సర్కారు.. ఇక ఇవ్వబోమని తేల్చి చెప్పేసింది. ఇప్పుడేమో రైతుభరోసా ఇచ్చేది కష్టమే అన్నట్లు మంత్రి తుమ్మల వ్యాఖ్యానించడంపై రైతాంగం భగ్గుమంటున్నది.

రైతులకు అండగా కేసీఆర్..

వాస్తవానికి రైతులకు తొలి నుంచి కేసీఆర్ అండగా నిలబడ్డారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను.. పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేసి రుణవిముక్తుల్ని చేశారు. అలాగే, పంట పెట్టుబడి కోసం అప్పులు చేస్తున్నారని తెలిసి రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. సీజన్ ఆరంభానికి ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారు. ప్రతి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 5 లక్షల మందికి పైగా రైతులకు రూ. వెయ్యి కోట్లకు పైగా సాయం అందించారు. పల్లెల్లోనే కేంద్రాలు పెట్టి వడ్లను మద్దతు ధరకు కొనిపించారు. నిరంతర విద్యుత్, పుల్లుగా సాగునీళ్లతో రైతులకు కష్టాలే లేకుండా పోయాయి. కానీ, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కర్షకులను మళ్లీ కష్టాల్లోకి నెట్టింది. పది నెలల కాలంలో రైతులకు సాయం చేసిన దాఖలాలే లేవు. ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామంటూ ఢంకా బజాయించి చెప్పిన నేతలే.. ఇప్పుడు చేతులెత్తేశారు. రుణమాఫీ రాక, పెట్టుబడి సాయం అందక రైతులంతా రోడ్డెక్కుతున్నారు. శనివారం వివిధ మండలాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ సైతం రైతుల తరపున పోరాటానికి సిద్ధమైంది. నేడు (ఆదివారం) అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నది.

వేల్పూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

మాఫీ లేదు.. సాయమూ లేదు

రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ అనేక మోసపూరిత వాగ్దానాలు చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల పెట్టుబడి సాయం వంటి హామీలు ఇచ్చింది. కానీ అమలులోకి వచ్చేసరికి మాత్రం రిక్త'హస్తమే' చూపెడుతున్నది. డిసెంబర్ 9న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ అని ప్రకటించిన రేవంత్ సర్కారు.. అధికారం చేపట్టి పది నెలలైనా అమలు చేయలేదు. మళ్లీ డిసెంబర్ వస్తున్నా పూర్తి స్థాయిలో రుణాలు మాఫీ కాలేదు. కనీసం రైతుభరోసా సాయమైనా అందుతుందని ఎదురు చూసిన రైతాంగానికి సర్కారు షాక్ ఇచ్చింది. జూన్‌లో జమ చేయాల్సిన డబ్బులు సీజన్ ముగిసినా ఇవ్వలేదు. ఇదిగో, అదిగో అని చెప్పి.. ఇప్పుడేమో ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. అన్ని పంటలను మద్దతు ధరకు కొంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో విఫలమైంది. ఇక, వడ్లకు రూ.500 బోనస్ అని హామీ ఇచ్చిన రేవంత్ సర్కారు.. సన్నాలకే అని కొర్రీలు పెట్టింది. ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేక చేతులెత్తేసిన హస్తం పార్టీపై మండిపడుతున్న రైతు లు.. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండే అని గుర్తు చేసుకుంటున్నారు.

ఆర్మూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మండలాల్లో వెల్లువెత్తిన నిరసనలు

రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఇవ్వలేమంటూ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తేల్చిచెప్పడంతో జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ శ్రేణులతో పాటు రైతులు రోడ్లపైకి తరలివచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, ఆర్మూర్, భీమ్‌గల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా తదితర మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం చెబుతారన్న కేసీఆర్ మాటలను.. రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందన్నారు. గత సీజన్‌లో రేపుమాపు అంటూ రైతుభరోసా ఇవ్వలేదని, ఈ సీజన్‌లో కూడా ఇవ్వలేమని మాట్లాడడం రైతులను నమ్మించి మోసం చేయడమేనని మండిపడ్డారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేజీబీవీలో వరుస పరిణామాలపై ట్రైనీ కలెక్టర్ విచారణ

మాక్లూర్, అక్టోబర్ 19: మండల కేంద్రంలోని కేజీబీవీలో కొంత కాలంగా వరుసగా చోటుచేసుకున్న పరిణామాలపై ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ శనివారం విచారణ చేపట్టారు. విద్యాలయంలో సిబ్బంది, ఎస్‌వో అనురాధ మధ్య సమన్వయం లోపించడంతో వారి మధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. విద్యార్థినుల ఎదుటే పరస్పర ఆరోపణలు, దూషణలు చేసుకోవడంతో దీనిపై ఇరువురు ఒకరిపై మరొకరు కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో డీఈవో, డీఈసీవో విచారణ చేపట్టి గొడవను సద్దుమనిపించారు. గురువారం మరో ఘటన చోటుచేసుకున్నది. గౌతమి అనే ఉపాధ్యాయురాలు రాత్రిడ్యూటీలో తన బంగారు గొలుసును పోగొట్టుకున్నది. దీంతో శుక్రవారం ఆమెతోపాటు, మరో నాన్‌టీచింగ్‌స్టాఫ్ కలిసి ఆరో తరగతి విద్యార్థినిని బయటికి తీసుకెళ్లడం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, పోలీసులు వచ్చి విచారించడం తదితర విషయాలు పత్రికల్లో వచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ శనివారం పాఠశాలకు చేరుకొని విద్యార్థినితోపాటు ఉపాధ్యాయురాలు గౌతమి, ఎస్‌వో అనురాధ, ఏఎన్ఎం ఈశ్వరీబాయిని విచారించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్ వెంట డీఈసీవో భాగ్యలక్ష్మి, ఎంఈవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్‌వో అనురాధను విచారిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్

జీజీహెచ్‌లో కిడ్నాప్ కలకలం

- తల్లి పక్కన నిద్రిస్తున్న ఏడాది బాలుడి అపహరణ
- సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుల చిత్రాలు
- ఆరునెలల క్రితం కూడా కిడ్నాప్‌కు గురైన ఓ చిన్నారి

చిన్నారిని ఎత్తుకెళ్తుండగా సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల చిత్రాలు

వినాయక్‌నగర్, అక్టోబర్19: నిత్యం రోగులతో రద్దీగా ఉండే జీజీహెచ్‌లో ఓ చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. ఉదయం నుంచి రాత్రి వరకు రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగించే దవాఖానలో తల్లి పక్కన నిద్రిస్తున్న ఏడాది బాలుడు అపహరణకు గురవడం విస్మయానికి గురిచేసింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకోగా.. చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితుల చిత్రాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కిడ్నాప్‌నకు పాల్పడిన వారు ముగ్గురు మహిళలే కావడం గమనార్హం. గడిచిన ఆరు నెలల్లో జీజీహెచ్ నుంచి ఇద్దరు కిడ్నాప్‌కు గురవడం ఆందోళన కలిగిస్తోంది. మద్నూర్‌కు చెందిన రాజు, లక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. రాజు నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. తన భార్య లక్ష్మి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమెకు జీజీహెచ్‌లో పరీక్షలు చేయించాడు. రాత్రి కావడంతో స్వగ్రామానికి తన భార్యను శనివారం ఉదయం పంపిద్దామనుకొని లక్ష్మి, పిల్లలతో కలిసి దవాఖాన ప్రాంగణంలోని ఓ షెడ్డుకింద నిద్రించారు. వారికి అర్ధరాత్రి మెలకువ రావడంతో పక్కన చూడగా వారి ఏడాది బాబు (మణికంఠ) కనిపించలేదు. ఒక్కసారిగా కంగారుపడిన ఆ దంపతులు దవాఖాన అంతా వెతికినా బాబు ఆచూకీ లభించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు దవాఖాన వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించగా ముగ్గురు మహిళలు కలిసి బాలుడిని ఎత్తుకుపోతున్నట్లు రికార్డయ్యింది. కేసు నమోదుచేసుకొని, చిన్నారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.



మాచారెడ్డి మండల కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న బీడీ కార్మికులు

షరతులు లేకుండా జీవన భృతి చెల్లించాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- మాచారెడ్డి మండల ఆఫీస్ ఎదుట ధర్నా

మాచారెడ్డి, అక్టోబర్ 19 : ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులందరికీ జీవన భృతి రూ.4016 ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మాచారెడ్డిలో శనివారం ఆందోళన చేపట్టారు. జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మండల పరిషత్ వరకు తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ, శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివచ్చి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సిద్ధిరాములు, అనసూయ, వెంకటలక్ష్మి, కుర్తిలింగం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కటాఫ్ తేదీని ఎత్తివేసి, బీడీ కార్మికులందరికీ రూ.4016 కు పెంచి జీవన భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలుచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై ఆంక్షలు విధించడంతో కార్మికులకు చేతినిండా పని దొరకడం లేదన్నారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్రకోల ఆంజనేయులు, నాగరాపు ఎల్లయ్య, సయ్యద్, కుమ్మరి రవి, నాంపల్లి, గంగాధర్, శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

దేశాయిపేట్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం

గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

దేశాయిపేట్‌లో సమావేశమైన గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 19 : గ్రామంలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ మండలంలోని దేశాయిపేట్ గ్రామస్తులు తీర్మానం చేసి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని కిరాణా దుకాణాలు, బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండడంతో యువకులు మద్యానికి బానిసవుతున్నారు. దీనిపై ఆందోళన వ్యక్తంచేసిన గ్రామస్తులు.. గ్రామ పెద్దలు, యువకులతో శనివారం సమావేశమయ్యారు. గ్రామంలో మద్యం అమ్మకాన్ని పూర్తిగా నిషేధిస్తూ తీర్మానించారు. తీర్మానాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.50వేలు జరిమానా విధించాలని నిర్ణయిం చారు. సమావేశంలో గ్రామపెద్దలు భూనేకర్ ప్రకాశ్, రమణ, విఠల్, సుధాకరప్ప, సాయాగౌడ్ పాల్గొన్నారు.